# మేదో హత్య

భయంతో, వేదనతో అస్థిమితంగా చలిస్తున్నాయి కుమార్ కళ్ళు. శరీరమంతా సన్నగా కంపిస్తూంది. గుండె చప్పుడు పైకే వినిపిస్తున్నట్లుగా వుంది. ఉన్నట్టుండి గుప్పిళ్ళు బిగిస్తున్నాడు. అంతలోనే నిస్సత్తువగా, నిర్జీవంగా చూస్తున్నాడు. మళ్ళీ అంతలోనే ఏదో పెనుభూతం తనను కబళించడానికి వెన్నంటి వస్తున్నట్లుగా ఒణికిపోతున్నాడు. బట్టలు నలిగి, మాసిపోయాయి. జుట్టంతా రేగిపోయి, నుదుటిమీద పడుతూంది.

అతని ప్రక్కన కూర్చున్న విమల ఉబికివస్తున్న దుఃఖాన్ని నిగ్రహించుకోవడానికి ప్రయత్నిస్తోంది. అన్న పరిస్థితి చూచి గుండె బ్రద్దలవడంతోపాటు అతను ఇంటికొచ్చేసరికి తల్లిదండ్రులిద్దరూ ఊరికి వెళ్ళడంవలన తను ఒంటిరిగా ఎదుర్కోవడానికి భయంగా వుంది.

ఆపరేషన్ థియేటర్ నుంచి బయటికి వచ్చిన డాక్టర్ శ్రుతిని చూడగానే సగం టెన్షన్ తగ్గినట్లనిపించింది విమలకు. లోపలికి రానని మొరాయిస్తున్న కుమార్‌ని బ్రతిమాలి, నచ్చజెప్పి లోపలికి తీసుకొచ్చింది.

"కూర్చోండి" కుమార్‌కి కుర్చీ చూపించింది శ్రుతి. అయిష్టంగా కుర్చీలో ముడుచుకు కూర్చుని నేలచూపులు చూస్తున్నాడతను.

"బాధేమిటో చెప్పండి" అడిగింది శ్రుతి. చివ్వున తలెత్తాడు కుమార్.

"బాధ!? నాకు బాధేంటి? అయామ్ హాపీ! వెరీ వెరీ హాపీ!!" అసహజంగా, పెద్దగా నవ్వసాగాడతను. నిశ్శబ్దంగా వున్న ఆ పరిసరాల్లో అతని నవ్వు వికృతంగా ప్రతిధ్వనిస్తోంది.

"అన్నయ్యా! ప్లీజ్! ఊరుకో, నవ్వకు" అతని భుజంమీద చెయ్యేసి ఏడుపు గొంతుకతో అతనిని వారించసాగింది విమల.

"నవ్వొద్దంటావా? హౌ డేర్ యు ఆర్?! మళ్ళీ అన్నావంటే చంపేస్తాను. నన్ను నవ్వొద్దన్నాళ్ళందర్నీ... నిన్నూ... మా ప్రొఫ్‌గాడ్నీ... ఐ విల్ కిల్ ఆల్ ఆఫ్ యూ... అందరి పీకలూ పిసికవతల పారేస్తాను" అంటూనే చేతులుచాచి విమల పీక పట్టుకోబోయాడు కుమార్. నిజంగా అన్నంతపనీ చేసేస్తాడేమోనన్న భీతితో వెనక్కు వెనక్కు జరుగుతూంది విమల.

"ఏయ్ మిస్టర్! ఆగు" ఉరుములా వికసించిన శ్రుతి కంఠం వినగానే చురకత్తుల్లా మెరుస్తున్న అతని కళ్ళు ఆమెవైపు తిరిగాయి.

"రండి. యిలా కూర్చోండి. కొంచెం సేపు రిలాక్సవండి" మృదువుగా చెప్తూ అతని చెయ్యి పట్టుకుని కూర్చోపెట్టింది శ్రుతి. ఆమె కళ్ళల్లోని కరుణ, ఆమె స్పర్శలోని ఓదార్పు, బుస్సున పొంగుతున్న అతని ఉద్రేకాన్ని తగ్గించాయి. శ్రుతి అతని పల్స్ గమనిస్తూంటే నెమ్మది నెమ్మదిగా అతను శాంతించాడు.

"మీరు కొంచెం వీక్‌గా కనిపిస్తున్నారు. బలానికి ఇంజక్షన్ చేస్తాను" అతని షర్ట్ స్లీవ్‌పైకి జరిపి ఇంజక్షనివ్వబోయింది శ్రుతి. ఆమె చెయ్యబోతున్న ఇంజక్షన్‌ని గమనించాడతను.

"కాంపోజా? లార్గాక్టిలా? డోంట్ గెట్‌షాక్డ్. నేను డాక్టర్ కుమార్ ఎమ్.ఎస్.ఎఫ్... ఎఫ్ అంటే ఏమిటో తెలుసా? ఎఫ్ అంటే ఫెయిల్డ్ - అవును, నేను ఎమ్.ఎస్. తప్పాను, కాదు- నన్ను తప్పించారు" హృదయ విదారకంగా ఏడవసాగాడతను. చెట్టంత మగాడు, ఒక ఉన్నత

విద్యావంతుడిలా మనోచాపల్యంతో సతమతమవుతూ బేలగా ఏడుస్తుంటే శ్రుతి గుండె పట్టేసినట్లయింది. ఒక నిమిషానికి తెలివి తెచ్చుకుని అతనిలోని అలజడిని తగ్గించి ప్రశాంత పరచడానికి ఇంజక్షనిచ్చింది. అతను కొంచెం మగతలోకి వెళ్ళాక విమలను వేరుగా తీసుకువెళ్ళి అతని గురించి అడిగింది.

"అంతా మా దురదృష్టం మేడమ్... వుండీలేని కుటుంబం మాది. అన్నయ్య మంచి మంచి కోచింగ్ సెంటర్సుకి వెళ్ళి ట్యూషన్ తీసుకునే అవకాశం లేకపోయినా కేవలం స్వంత తెలివితేటలతో కష్టపడి చదివి మెడికల్ ఎంట్రెన్స్‌లో ఫస్టు వచ్చాడు.

మెడిసిన్‌లో చేరినప్పటినుంచి క్లాస్ ఫస్ట్ రావాలనీ, ప్రతి సబ్జక్ట్‌లో గోల్డ్‌మెడల్ సంపాదించుకోవాలనే లక్ష్యంతో అహోరాత్రులు కష్టపడి చదివాడు. సెలవుల్లో కూడా లైబ్రరీకి అంటుకుపోయి మమ్మల్ని చూడడానికి కూడా వచ్చేవాడు కాదు. మెడిసిన్‌లో చేరాక యిన్నేళ్ళలో తను ఒక్క సినిమా కూడా చూళ్ళేదంటే మీరు నమ్మరేమో!"

ఆగి శ్రుతివంక సాభిప్రాయంగా చూసింది విమల. అంతగా చదివే వాళ్ళు తను చదువుకున్న టైమ్‌లో కూడా ఉండడం తెలుసు కనుక నవ్వి వూరుకుంది శ్రుతి.

"కాని ప్రతిసారీ డబ్బు, హోదా, కులం... ఏదో ఒకటి టాప్ రాంక్‌లో వున్న అన్నయ్యను క్రిందకు తోసేసి యీ మూడిట్లో ఏదో ఒకటో, అంతకుమించో వున్న అదృష్టవంతుడిని అందలం ఎక్కించేది. తనకు తగులుతున్న దెబ్బలకు క్రుంగిపోయినా మళ్ళీ ధైర్యం తెచ్చుకుని యీసారైనా తన ప్రతిభకు గుర్తింపు వస్తుందనీ, యీసారైనా తన కష్టానికి ప్రతిఫలం దక్కుతుందనీ ఆశపడేవాడు. యీసారి మరీ దీన్నో జీవన్మరణ సమస్యగా తీసుకుని చదివాడు. కాని, మళ్ళీ అన్నయ్యను యిద్దరు వెనక్కు తోసేశారు. ఒకరు డబ్బుతో డిగ్రీ కొనుక్కుంటే, మరొకరు కులాభిమానంవల్ల పాసయారు. స్వయం కృషి, తెలివితేటలు తప్ప మరో సపోర్టులేని అన్నయ్యకు నెక్స్ట్ టైం బెటర్ లక్ చెప్పాడు వాళ్ళ ప్రొఫెసర్. కాని... ఈ రోజున మనం ఎలాంటి దారుణమైన పరిస్థితుల్లో బ్రతుకుతున్నామో తెలిసికూడా అన్నయ్య ఇంతగా షాక్‌తిని ఇలా అవడం కేవలం మా బాడ్‌లక్ మేడమ్!" విమల చెప్తుంది వింటూ దేశంలోనుంచి మేధావులు వలసపోవడానికీ, దేశంలో వున్న ఎక్కువమంది మేధావుల మేధస్సు నిరుపయోగంగా వుండిపోవడానికీ, దేశానికి ఉపయోగపడవలసిన మేధస్సు దారుణంగా హత్యచేయబడి కుమార్ లాంటివారు పిచ్చివాళ్ళుగానో, సంఘ విద్రోహక శక్తులుగానో మారడానికీ అసలు కారణాల్ని మరోసారి గుర్తుకు తెచ్చుకున్న శ్రుతి హృదయం ఆవేశంతో నిండింది.